# బస్సుస్టాండులో కిష్టమ్మ

**తెలవారుఝాము** అయిదు గంటలకు శ్రీకాకుళం బస్సుస్టాండులో బొబ్బిలి వెళ్లే బస్సు ఆగి ఉంది. పదేళ్ళ కిష్టమ్మ ఫుట్‌బోర్డు మీద నిలబడి, "పాందూరు, రాజాం, తెర్లాం, బొబ్బిలి" అని పదేపదే పిట్టలా అరుస్తున్నాడు. చిరిగి పోయి, పేలికలు వేలాడుతున్న పెద్దసైజు తెల్ల కోటు, కాకీలాగు తొడుక్కున్నాడు. తెల్లగా, బొద్దుగా ఉన్నాడు. రాగిజుట్టు, పిల్లికళ్ళు. జుట్టు బాగా పెరిగిపోయి చెవులమీదికెక్కి గూడుకట్టులా ఉంది తల.

ఎలాకేనా గంతులువేస్తూ, నవ్వుతూ, సినిమా పాటలు పాడుతూ, నిత్యం హడావిడిగా అటూ ఇటూ పరుగెడుతూ, ప్రయాణికుల సామాన్లు మోస్తూ, బస్సుల వాళ్ళకు కాన్వాస్ చేస్తూ, అక్కడే తిరుగుతూ ఉంటాడు. బస్సుస్టాండే కిష్టమ్మ నివాసం. రాత్రి ఆఖరు బస్సు వచ్చే వరకూ మేలుకుని చుట్టుపట్ల కిళ్లీకొట్లన్నీ కట్టేసేవరకూ వాళ్ళతో పరాచికాలాడుతూ కాలం గడిపి ఏదో బస్సులో సీటుకింద దూరి వెచ్చగా పడుకుంటాడు.

ఒక్కరోజు కిష్టమ్మ లేకపోతే, బస్సు కండక్టర్లకూ, డ్రైవర్లకూ, చుట్టుపట్ల కిళ్ళీకొట్ల వాళ్ళకూ చెయ్యి తెగ్గొట్టినట్టు ఉంటుంది. ఏదో పోగొట్టుకున్నట్టు బాధ పడతారు. బస్సుస్టాండు సందడిలేక బోసిగా ఉన్నట్టు ఉంటుంది.

ఆ రోజున కిష్టమ్మ నోరు చించుకుని మరీ అరుస్తున్నాడు. ఎంతసేపటినుంచి అరుస్తున్నా ఒక్కడూ చేరలేదు. కండక్టరువచ్చి వెనక సీట్లో చేరగిలబడ్డాడు. జేబులోంచి రెండు బీడీలు తీసి కిష్టమ్మకు ఒకటి అందించాడు. ఇద్దరూ బీడీలు ముట్టించి కబుర్లలో పడ్డారు.

ఇంతలో ఒక ఆఫీసరు కుటుంబ సహితంగా రెండు రిక్షాల్లో వచ్చాడు. కిష్టమ్మ కాలుస్తున్న బీడీ అవతల పారేసి, పరుగులో వెళ్లి రిక్షాలో సామానంతా టాపు మీదికి ఎక్కించాడు. ఆఫీసరు గారు వెళ్లి ఫ్రంట్ సీటులో కూర్చున్నారు. ఆయన భార్య, పదహారేళ్ల కూతురు, అయిదేళ్ల కొడుకు, ఒక కుక్కపిల్ల పక్క సీటులో కూర్చు న్నారు. కిష్టమ్మ కండక్టరు పక్కన కూర్చుని ఏదో ఆలోచిస్తూ ఆఫీసరు కుటుంబంకేసి తదే కంగా చూస్తున్నాడు. ఆఫీసరు వెనక్కి తిరిగి మధ్యమధ్య కిష్టమ్మకేసి చూస్తున్నాడు.

అయిదు నిమిషాలు గడిచాక కిష్టమ్మ క్రిందికి దిగి మళ్లీ బీడీ వెలిగించి ఫుట్‌బోర్డు మీద నిలు చుని మళ్లీ అరవటం ప్రారంభించాడు. ఆఫీసరు కూతురు ఏదో వారపత్రిక చదువుతూంది. అప్పుడే హోటల్లో కాఫీతాగి ఒక ఇరవై ఏళ్ల యువకుడు, హడావుడిగావచ్చి ఆఫీసరుకూతురుకు ఎదురుగా ఉన్న సీట్లో కూర్చుని జేబులోంచి సిగరెట్టు తీసి కాల్చటం మొదలెట్టాడు. మధ్య మధ్య ఆఫీసరు కూతురుకేసి దొంగచూపులు చూస్తున్నాడు. కిష్టమ్మ అరవటం మానేసి సినిమా పాటలు పాడటం మొదలెట్టాడు.

డ్రైవర్ వచ్చి సీటులో కూర్చోగానే కిష్టమ్మ బకెట్టులో నీళ్లుతెచ్చి పోశాడు. డ్రైవర్ ఇక బస్సు బయలుదేరుతుందని సూచనగా హారన్ మోగించాడు. కిష్టమ్మ గొంతు చించుకుని అరు స్తున్నాడు.

బస్సు బయలుదేరింది. కిష్టమ్మ ఫుట్‌బోర్డు మీదనుంచి క్రిందికి ఉరికి ఫ్రంట్ సీటులో కూర్చున్న ఆఫీసరు దగ్గరకు పరుగెత్తుకువెళ్లి, "సార్! డబ్బులు!" అన్నాడు. ఆ ఆఫీసరు అయిదు రూపాయల కాగితం తీసి చేతిలో పెట్టాడు.

"చిల్లర లేదు, సార్" అన్నాడు కిష్టమ్మ.

"ఫరవాలేదు, ఉంచుకో" అన్నాడు ఆయన.

కిష్టమ్మ ఒక్క ఉరుకులో క్రిందికి దిగి అయిదు రూపాయల నోటు మడిచి చొక్కా మడతల్లో పెట్టి హుషారుగా ఒక సినిమా పాట అందుకున్నాడు. బస్సు వెళ్లిపోతూంది. బస్సులో ఆఫీసరు ఇంకా కిష్టమ్మకేసి చూస్తూనే ఉన్నాడు.

* * * *

కిష్టమ్మ పుట్టు పూర్వోత్తరాలు ఎవరికీ వివరంగా తెలియవు. పన్నెండేళ్ళ క్రిందట ఆముదాలవలస నుంచి వచ్చిన బస్సులోంచి, మాసిన బట్టలు కట్టుకుని కళ్ళు లోతుకు పోయి, ముఖం డోక్కుపోయి, చావుకు సిద్ధంగా దిగింది ఒకామె. ఒరియాలోనే కాని తెలుగు మాట్లాడడం చేతకాలేదు. అక్కడ చేరిన రిక్షావాళ్ళు, గుర్రపు బళ్ళవాళ్ళు వేళాకోళం వెక్కిరింతలు ప్రారంభిం చారు. అప్పుడే హోటల్లోంచి బయటికి వచ్చిన మనిషి ఆవిడతో ఒరియాలో ఏదో మాట్లాడి అక్కడ హోటల్లో పనికి కుదిర్చి వెళ్లిపోయాడు. ఆమెకు రాగిజుట్టు, పిల్లికళ్ళు. మనిషిమాత్రం మంచి అందగత్తె.

రెండేళ్ళపాటుఆహోటల్లోనే పనిచేసి తరువాత కిష్టమ్మను కని ఒక అర్ధరాత్రి బస్సుస్టాండులోనే వదిలి వెళ్ళిపోయింది.ఆమె ఎక్కడినుంచి వచ్చిందో, ఎక్కడకు వెళ్లిపోయిందో ఎవరికీ తెలియదు. అక్కడికి ఒంటరిగా వచ్చింది. ఒంటరిగానే వెళ్లి పోయింది.

* * * *

పది రోజులు గడిచాక ఒక రోజు తెల్లవారగట్ల ఆ ఆఫీసరు ఒక చిన్న లెదర్ బాగ్ పట్టుకుని ఒంట రిగా బస్సు స్టాండుకు రిక్షాలో వచ్చాడు. అప్పటి కింకా ప్రయాణికు లెవరూ అక్కడ చేరలేదు. బొబ్బిలి వెళ్లే బస్సుస్టాండులో ఆగివుంది. కండ క్టరు, డ్రైవరూ ఇంకారాలేదు. బస్సుస్టాండులో ఇంకా సందడి ప్రారంభం కాలేదు. ఆ ఆఫీసరు రిక్షా దిగి షెడ్‌లోని సిమెంటు బెంచీమీద కూర్చున్నాడు.

రావిచెట్టుక్రింద ఒక ముసలిమనిషి కూర్చుని చలిమంట వేసుకుంటున్నాడు. కిష్టమ్మ సీటు క్రింది నుంచి లేచి ఆవలిస్తూ వచ్చి చలిమంట దగ్గరకు వెళ్ళాడు. జేబులోంచి బీడీతీసి వెలిగించి ముసలాడితో కబుర్లు మొదలెట్టాడు. ఆఫీసరు వాళ్లకేసి చూస్తూ కూర్చున్నాడు.

అయిదు నిమిషాలు గడిచాక కాలుస్తున్న బీడీ అవతల పారేసి సిమెంటు బెంచీ కేసి నడిచాడు కిష్టమ్మ. చీకట్లో బెంచీమీద కూర్చున్న ఆఫీసర్ని పరకాయించి చూసి, "సార్, మీరా! ఇక్కడ కూర్చున్నారేమిటి?" అని అడిగాడు.

"బొబ్బిలి వెళ్లే బస్సుకోసమోయ్" అన్నాడు ఆయన.

"అదుగో! అక్కడ నిలబడ్డదే, సార్! ఇంకా కండక్టరు రాలేదు. అక్కడకు వెళ్లి కూర్చోండి. వాళ్లొచ్చే టైమయింది" అన్నాడు.

ఆ ఆఫీసరు మాట్లాడకుండా వెళ్ళి బస్సులో కూర్చున్నాడు. కిష్టమ్మ కూడ వెళ్ళి ఫుట్‌బోర్డు మీద నిల్చున్నాడు.

"ఇలా వచ్చి కూర్చోవోయ్" అన్నాడు ఆయన.

కిష్టమ్మ మాట్లాడకుండా వెళ్ళి ఆఫీసరుకు ఎదురుగా కూర్చున్నాడు.

"నీ పేరేమిటి?"

"కిష్టమ్మ."

"రాత్రుళ్ళు ఇక్కడే పడుకుంటావా?"

"అవును, సార్! నా కెవళ్ళూ లేరు. నా పడక, నా తిండి, అంతా ఈ బస్సు స్టాండులోనే." కిష్టమ్మ చెప్పాడు.

"మీ అమ్మా, నాన్నా ఏమయ్యారు?"

"ఏమో,సార్? వాళ్ళ గురించి నాకుతెలియదు. ఎక్కడికో వెళ్ళిపోయారనుకుంటాను" అన్నాడు కిష్టమ్మ.

ఆ ఆఫీసరు ఒక వేడి నిట్టూర్పు విడిచాడు. కాస్సేపు ఇద్దరూ మాట్లాడుకోలేదు.

"మా ఇంటికి వస్తావూ?" అని అడిగాడు.

"రాను, సార్. నా కిక్కడే బాగుంటుంది" అన్నాడు కిష్టమ్మ బుర్ర గోక్కుంటూ. ఆ ఆఫీ సరు ఇక మాట్లాడలేదు. జేబులోంచి సిగరెట్టు తీసి అంటించాడు. కిళ్లీకొట్టు అసామీ వచ్చి హడావిడిగా కొట్టు తెరుస్తున్నాడు. కిష్టమ్మ బస్సులోంచి క్రిందికి దిగి, "అలా వెళ్లొస్తాను, సార్!" అని చెప్పి కిళ్లీకొట్టు అసామీ దగ్గరికి వెళ్లి కబుర్లు మొదలెట్టాడు.

నెమ్మదిగా ప్రయాణికులు బస్సుస్టాండులోకి వచ్చి చేరుతున్నారు. చుట్టుపట్ల దుకాణాలన్నీ తెరుస్తున్నారు. సందడి ప్రారంభమైంది. కండ క్టరు, డ్రైవరు వచ్చి కూర్చున్నారు. ఆఫీసరు ఫ్రంటు సీటులోకి మారాడు. కిష్టమ్మ ఫుట్ బోర్డు మీదినుంచి అరవటం మొదలెట్టాడు.

ఫ్రంట్ సీటులో కూర్చున్న ఆఫీసరు డ్రైవర్ని అడిగాడు—"కిష్టమ్మ పుట్టుపూర్వోత్తరాలు నీకేమైనా తెలుసా?" అని.

కండక్టరు ఆఫీసరు వంక ఆశ్చర్యంగా చూసి,


బస్సుస్టాండులలో
కిష్టమ్మ

"వాడిగురించి అంత బాగా ఎవరికీ తెలియదు, సార్. పదేళ్ళ క్రిందటనుకుంటాను—హోటల్లో పని చేసే ఒరియా మనిషెవరో కని వదిలి వెళ్ళిపోయిం దనుకుంటారు" అన్నాడు.

ఆ ఆఫీసరు తిరిగి మాట్లాడలేదు. డ్రైవరు, "ఏం, సార్? వాడిగురించి అడుగుతున్నారు" అన్నాడు సందేహంగా.

"ఊరకనే. ఎప్పుడూ ఇక్కడే కనుపిస్తాడని" అని ఆయన అన్నాడు.

కిష్టమ్మ ఇంజన్‌లో నీళ్ళు పోశాడు. డ్రైవర్ హారన్ మోగించి బయలుదేరేశాడు. ఆఫీసరు ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు.

• • •

మళ్ళీ పది రోజులు గడిచాక ఒక రోజు తెల్ల వారగట్ల నాలుగు గంటలకు ఇంకా హోరున వర్షం కురుస్తూంది. బస్సుస్టాండు వర్షం నీటితో నిండిపోయింది. బస్సుస్టాండులో దీపాలు మధ్యమధ్య ఆరిపోతున్నాయి. రాత్రి గాలివానకు బస్సుస్టాండులోని రావిచెట్టు కొమ్మ విరిగి నేల మీద పడింది. దాని కొమ్మలు, ఆకులు వర్షం నీటిలో మునిగిపోయిఉన్నాయి.

కిష్టమ్మ సీటు క్రిందనుంచి బయటకు వచ్చి ఫుట్‌బోర్డు మీద నిలుచుని ఒక్కసారి స్టాండంతా కలయజూశాడు. రోజూ ఎంతో మంది ప్రయాణికులకు నీడనిచ్చి కాపాడే రావిచెట్టుకొమ్మ విరిగి పడినందుకు కిష్టమ్మ మనసు చివుక్కుమంది. జేబులోనుంచి బీడీ తీసి వెలిగించాడు.

ఆఫీసరు రెయిన్ కోటు వేసుకుని బాటరీ లైటు చేత్తో పట్టుకుని వచ్చి షెడ్‌లోని సిమెంటు బెంచీమీద కూర్చున్నాడు. కుడి చేతిలోని లెదర్‌బాగ్ పక్కన పెట్టుకున్నాడు. కిష్టమ్మ షెడ్‌లోనికి వచ్చి సిమెంటు బెంచీ మీద కూర్చున్న మనిషిని పరకాయించి చూశాడు. చీకట్లో ఎవరైందీ తెలియలేదు.

"నేనోయి, కిష్టమ్మా!" అన్నాడు ఆయన.

"మీరా, సార్!" అంటూ బెంచీ మీద చతికిల బడి, "మీరు పదిరోజుల కొకసారి ఎక్కడికి వెళతారు, సార్" అని అడిగాడు కిష్టమ్మ.

"కాంప్లుకోయి" అన్నాడు ఆఫీసరు.

అప్పుడే స్టాండు కెదురుగా ఉన్న కాఫీహోటల్ తెరిచారు. లోపలనుంచి సన్నగా సినిమా పాటలు వినిపిస్తున్నాయి. కిష్టమ్మ లేచి అటుకేసి వెళ్ళి పోయాడు. కిష్టమ్మ వెళ్ళిపోయాక ఒక లావు పాటి మనిషి వచ్చి ఆఫీసరుపక్కన చతికిలబడ్డాడు. ఆఫీసరు ఏదో ఆలోచనలో మునిగిపోయాడు. ఆ లావుపాటి మనిషి ఆఫీసరుకేసి, లెదర్‌బాగ్‌కేసి మార్చిమార్చి చూస్తున్నాడు.

బస్సు బయలుదేరుతూంది. ఎందుచేతో ఆఫీ సరు వచ్చి కూర్చోలేదు. కిష్టమ్మ ఫ్రంట్ సీటు లోకి చూసి ఫుట్‌బోర్డుమీదనుంచి క్రిందికి ఉరికి షెడ్‌లోకి పరుగెత్తాడు. ఆఫీసరు ఇంకా ఆలో చిస్తూనే కూర్చుని ఉన్నాడు.

"సార్! మీరు వెళ్ళరా? బొబ్బిలి వెళ్ళే బస్సు వెళ్ళబోతోంది" అన్నాడు కిష్టమ్మ.

**కన్న మమకారం ఎంతటిదో చెప్పడం సాధ్యంకాదు. మరే ఆధారమూ, సాక్ష్యమూ లేకపోయినా, ఎన్నడూ చూడకపోయినా ఎవరికి ఎవరు కావలసినవారో తెలిసి పోతుంది. కన్న బిడ్డలకు అన్యాయం చేసిన వారికి మరీను.**

ఆఫీసరు హడావిడిగా లేచి పరుగెత్తి వెళ్ళి ఫ్రంట్ సీటులో కూర్చున్నాడు. కిష్టమ్మ చూపు బెంచీమీది లావుపాటి మనిషి చేతిలోని లెదర్‌బాగ్ మీదికి వెళ్ళింది.

"ఏయ్, ఆ లెదర్‌బాగ్ ఇలా తే!" అన్నాడు.

ఆ మనిషి కిష్టమ్మని పరకాయించి చూచి నల్లటి పళ్ళను బయటికి పెట్టి నవ్వుతూ, "ఇది నీ బాబుసొమ్మేంకాదు" అన్నాడు.

"దొంగ వెధవా! అది బస్సులో ఆఫీసరిది" అని లాక్కోబోయాడు కిష్టమ్మ.

"ఓ సబ్బో! మహా ధర్మాత్ముడు బయలు దేరాడు!" అని కిష్టమ్మను ఒక్క విసురు విసిరాడు. కిష్టమ్మ వెళ్ళి ఎదురుగా ఉన్న సిమెంటు బెంచీ మీద బోర్లా పడ్డాడు. ముక్కు పగిలి రక్తం కారుతూంది. కిష్టమ్మ లెక్కచేయలేదు. లేచి నిలుచుని ఒక్క దూకు దూకి ఆ మనిషిమీద పడి చుట్టేసి చేయి గట్టిగా కరిచాడు. ఆ మనిషి చేతిలో బాగ్ జారి క్రింద పడింది. కిష్టమ్మ, అది అందుకుని ఒక్క పరుగులో వెళ్ళి, అప్పుడే మలుపు తిరిగి రోడ్డెక్కి వేగంగా వెళుతున్న బస్సు అందుకుని ఫ్రంట్ సీటులోకి ఎక్కి, "సార్, మీరు లెదర్ బాగ్ మరిచిపోయారు" అని ఆఫీసరుకు అందించాడు.

ఆఫీసరు లెదర్‌బాగ్ అందుకుని కిష్టమ్మకేసి పరిశీలనగా చూసి, "అదేమిటి, ముఖమంతా రక్తమైంది?" అని అడిగాడు.

"ఏమీలేదు, సార్. అందులో అన్నీ ఉన్నాయో లేవో ఒకసారి చూడండి" అన్నాడు.

ఆఫీసరు బాగ్ తెరిచి లెక్కపెట్టుకుని "అన్నీ ఉన్నాయోయ్" అన్నాడు.

ఆఫీసరు బాగ్‌లోంచి ఒక నోట్లకట్టతీసి, "ఇదుగోనోయ్, నీకు ప్రజంటేషన్" అన్నాడు. ఆ మాట పూర్తికాకుండానే కిష్టమ్మ క్రిందికి ఉరికేశాడు.

"పరవాలేదు. ఉంచండి, సార్. మళ్ళీ వచ్చి నప్పుడు ఇద్దురుగాని" అన్నాడు కిష్టమ్మ. ఆఫీ సరు తిరిగి నోట్లకట్ట బాగ్‌లో పెట్టుకున్నాడు. కిష్టమ్మ తిన్నగా బస్సుస్టాండులో షెడ్‌లోకి వెళ్ళి ఇందాకటి లావుపాటి మనిషికోసం వెతికాడు. ఆ మనిషి చుట్టుపట్ల ఎక్కడా లేడు.

• • •

ఇది జరిగిన మూడు రోజుల తరువాత ఆఫీసరు బొబ్బిలి నుంచి వచ్చిన బస్సులోంచి దిగి కిష్టమ్మ కోసం అటూ ఇటూ చూశాడు. బస్సుస్టాండంతా నిండిపోయే ఎందువల్లో కిష్టమ్మ ఆ రోజు కనిపించటం లేదు. కిష్టమ్మలేక బస్సుస్టాండంతా బోసిగా ఉంది. ఆఫీసర్ ఎదురుగా ఉన్న కిళ్ళీ కొట్టు దగ్గరికి వెళ్ళి, "ఇక్కడుండే కిష్టమ్మ ఏమయ్యాడు?" అని అడిగాడు.

## ఉప్పులూరి సత్యనారాయణ

కిళ్ళీకొట్టు ఆసామీ ఆఫీసర్ని ఎగాదిగా పరీక్షగా చూసి ఆశ్చర్యంగా, "ఏమిటి, సార్, వాడిగురించి అడుగుతున్నారు? వాడితో పనేమిటి మీకు?" అని అడిగాడు.

"ఊరకనే. కొద్దిగా పనుంది" అన్నాడు.

"వాడో దొంగవెధవ, సార్. స్టాండులో ఎవరి జేబో కొట్టేస్తుంటే పోలీసులు పట్టుకు తీసుకుపోయారు."

ఆఫీసరు ఒక నిమిషం మాట్లాడలేదు. "ఎప్పుడు?" అని అడిగాడు.

"మొన్న మధ్యాహ్నం."

"కిష్టమ్మ అలాంటివాడు కాదోయి!"

"అంతా అలాగే అనుకునేవాళ్ళం. అయినా ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు, సార్" అన్నాడు కిళ్ళీకొట్టు ఆసామీ.

ఆ ఆఫీసరు మాట్లాడకుండా రిక్షా ఎక్కి ఇంటిదారి పట్టాడు.

• • •

ఒక వారం రోజులు పోయాక కిష్టమ్మ గొంతు స్టాండంతా వినబడుతూంది. హడా విడిగా అటూ ఇటూ పరుగెడుతూ ఎప్పటిలాగే హుషారుగా ఉన్నాడు. ఆ రోజు సంతకావటం వల్ల వచ్చీ పోయే ప్రయాణికులతో స్టాండు రద్దీగా ఉంది. కిష్టమ్మకు పని అంతకన్నా రద్దీగాఉంది. మధ్యాహ్నం బొబ్బిలి వెళ్ళే బస్సు ఫుట్‌బోర్డు మీద నిలుచుని గట్టిగా అరుస్తున్నాడు. బస్సు బయలుదేరి రోడ్డు ఎక్కేవరకూ అరిచి కండ క్టరుతో చెప్పి క్రిందికి ఉరికేశాడు. అవతలవైపు నుంచి విసురుగా వస్తున్న లారీ కిష్టమ్మ మీది నుంచి విసురుగా వెళ్ళిపోయింది. రక్తం కళ్ళాపి చల్లినట్లు రోడ్డంతా చిమ్మింది. క్షణంలో జనం చుట్టూ మూగారు.

ఇదివరకటి ఆఫీసరు లెదర్‌బాగ్ చేత్తోపట్టు కుని రిక్షాలోంచి దిగి కిష్టమ్మకోసం స్టాండంతా పరిశీలించి చూశాడు. ఎక్కడా కిష్టమ్మ గొంతు వినిపించటం లేదు. గబగబా కిళ్ళీకొట్టు దగ్గరకు వెళ్ళి, "ఇదుగో, కిష్టమ్మ వచ్చాడటగా? ఎక్కడికి వెళ్ళాడు?" అని అడిగాడు ఆ కిళ్ళీకొట్టు ఆసామీని.

ఆ కిళ్ళీకొట్లో మనిషి, "వారం రోజుల క్రిందటకూడా మీరేకదా, సార్, వాడిగురించి అడిగింది?" అన్నాడు.

"అవును. నేనే."

"ఆ పర్సు కొట్టేసింది వీడుకాదట, సార్. మరొక డెవడోనట. వీడిని వదిలేశారు" అన్నాడు.

"అది సరేలేవోయి. ఇప్పుడు కిష్టమ్మ ఎక్కడి కెళ్ళాడు?"

(తరువాయి 62 వ పేజీలో)

# జ్వాలాతోరణం!

ఎల్లోరా

ఉత్తప్పుడు దీపం
ఆర్పకుంటే తప్పు!
ఆత్యయిక స్థితిలో దీపం
వెలిగించడం తప్పు!!

నరకాసురుణ్ణి పరిమార్చి
చేసుకొంటూంది లోకం దీపావళి!
శత్రునిబర్హణంచేసి, భారత్
చేసుకొంటుంది విజయ దీపావళి!

గుండెల్లో జ్వాలా తోరణం
మంటలై నింగినంటుతూంది!
గుండ్లకు గుండె లొడ్డి జనత
'కాబ్లాట్'లో 'క్రాంతి' సాధిస్తూంది!

భారతం పొలిమేరలో దీపావళి
మొన్ననే ప్రారంభమ్మైంది!
టపాసులకు బదులు తుపాకుల
విజయగర్జన వినిపిస్తూంది!

అమ్మ పక్కలో ఉన్నట్లుండి
పసిపాప నిద్రలో కెవ్వుమంది!
నరకాసురుడు అదిగో అని
భయం చూపు మూల చూసింది!!
ఎవరమ్మా ఆ బూచాడు అంటే
'ఆయూబు, అమ్మో' అంది!

ఆకాశంలో శాంతికపోతం
భయంతో గిజగిజమంది!
సహజీవన నవభారతం
సరిహద్దు ఎరుపెక్కింది!

విశ్రాంతిలోవున్న శాంతి సైనికుడు
శాంతి హస్తంతో గన్ పట్టాడు!
పాకిస్తాన్ సందేహాలకు
క్రాంతిజనత ఎదురునిలిచింది!

సరిహద్దున జ్వాలా తోరణం
కాలుస్తూంది చూడు!
శాంతి ఇలను సాధించగ
ప్రాణమొడ్డి పోరు!! ★

## తరలి రండు

(7 వ పేజీ తరువాయి)

"వింటున్నావా, కుమార్? నేను, సుందరం మామయ్యను!"

"వింటున్నాను!" కుమార్ గొంతు హీనంగా అయినా ఆనందమే ధ్వనించింది.

"కుమార్! నాకోసం బెంగపెట్టుకోకు. నేను బాగానే ఉన్నాను.....

"నేనూ నీలాగే చిన్నప్పుడు సైన్యంలో చేరాలని తహతహలాడాను. కొన్నాళ్ళు పోనిమ్మన్నారు. బాగా చదువుకొని పెద్దవాణ్ణయి ఇప్పుడు నిజంగా యుద్ధం చేస్తున్నాను. చూశావా, మరి?....."

"ఓ" అన్నాడు కుమార్.

"నువ్వు కూడా బాగా చదువుకొని పెద్దవాడివైతే, సైన్యంలో చేరుదువుగాని. మనం ఇద్దరం కలిసి యుద్ధం చేద్దాం. సరేనా?...."

"ఓ! ఓ!" అన్నాడు కుమార్.

"మా నాన్నగారు ఇప్పుడప్పుడే నీకుకనపడవద్దన్నారు. మళ్ళీ రేపువచ్చి మాట్లాడతాను. గ్లూకోజూ అవీ తీసుకొంటావా, మరి?......"

"అమ్మా! గ్లూకోజే!" అన్నాడు కుమార్.

"కుమార్‌కు ఇంకేమీ భయంలేదు. వస్తాను" అన్నారు డాక్టరు వీరభద్రంగారు.

కుమార్ ఆరోగ్యం చక్కబడింది. తల్లితండ్రుల మనసులు కుదుటబడ్డాయి.

కాని, కుమార్ మాత్రం జీవితంలో మరెన్నడూ సుందరం మామయ్యను చూడలేదు.

ఆ తరువాత డాక్టరుగారి ఆరోగ్యం దిగజారిపోయింది. మళ్ళీ ఆయన ముఖంలో చిరునవ్వు చూసినవారు ఎవరూ లేరు.

కుమార్ జబ్బుగా ఉన్న సంగతి తండ్రి లేఖద్వారా తెలుసుకొని కుమార్ జబ్బుకు కారణం ఊహించి, తన మాటలు టేప్ రికార్డుచేసి, అధికారుల ప్రత్యేకానుమతితో పంపి కుమార్ ప్రాణం కాపాడిన సుందరం మామయ్యకు —

ప్రభుత్వం వీరచక్రం బహూకరించి సన్మానించిన సుందరం మామయ్యకు—

ఆ బహుమతి సుందరం మామయ్య వీరమరణం పొందిన తర్వాతనే లభించిందని కుమార్‌కు చెప్పేవారెవరు?

అంతటి దుఃఖాన్నీ కడుపులోనే దాచుకొని కుమార్ ప్రాణం కాపాడిన త్యాగమూర్తి డాక్టరు వీరభద్రంగారు భరతమాత అనుంగు బిడ్డలలో అగ్రగణ్యులని చెప్పనివారెవరు?

'తరలి రండు తనయులార
పరగున సాహసముతోడ
భరతమాత ఖండనమునకున్!'

జయ్ హింద్! ★

## బస్సుస్టాండులో కిష్టమ్మ

(55 వ పేజీ తరువాయి)

"పాపం! వాడిమీదనుంచి లారీ వెళ్ళిపోయిందట, సార్. అదుగో, జనం వెళ్ళిచూస్తున్నారు" అన్నాడు జనం గుంపుగా చేరిన చోటుచూపిస్తూ.

ఆఫీసరు హడావిడిగా అటు పరుగెత్తాడు. జనాన్ని త్రోసుకుంటూ లోపలికి వెళ్ళాడు. కిష్టమ్మ బాధగా మూలుగుతూ జనంకేసి చూస్తున్నాడు. ఆఫీసరు కనుపించగానే తలతిప్పి "సార్, మీరా?" అన్నాడు.

"అవును. నేనేనోయి. నీకో ప్రజెంటేషన్ పట్టుకొచ్చాను. నీకోసం వారంరోజులనుంచి చూస్తున్నాను" అన్నాడు బాగ్‌లోంచి నోట్ల కట్ట తీసి.

కిష్టమ్మ ఏదో చెప్పదలచి నోరు విప్ప సందేహించాడు.

"కిష్టమ్మా! ఏదైనా చెప్పదలిస్తే సందేహించకు. నేను నీ తండ్రినోయి" అన్నాడు.

కిష్టమ్మ చిరునవ్వు నవ్వుతూ, "నాకు తెలుసు, సార్!" అన్నాడు. అంతే. కిష్టమ్మ తల ప్రక్కకు వాలిపోయింది. కళ్ళు మూతలు పడ్డాయి. ★